13-5-99



# అపరిపక్వతే సమస్య, అస్థిరత కాదు



బాలగోపాల్

ఈమధ్య దేశ రాజకీయాలలో నెలకొన్న అస్థిరతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ రాజకీయ వ్యవస్థ గురించి చాలా మంది చర్చిస్తున్నారు. కొన్ని ప్రత్యామ్నాయాలను ప్రతిపాదిస్తున్నారు కూడా. అధ్యక్ష తరహా పాలన మంచిదని కొందరూ, ఏ ఒక్క పార్టీకి చట్టసభలో మెజారిటీ రానప్పుడు అన్ని పార్టీలూ కలిసి జాతీయ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఉచితమని మరికొందరు ఇంకా రకరకాల సూచనలు చేస్తున్నారు.

కానీ ప్రభుత్వాలు అస్థిరంగా ఉండకూడదన్న నియమమెక్కడైనా ఉందా? ప్రభుత్వాలు ప్రజాస్వామికంగా ఉండాలి. అంటే అవి ప్రజాభీష్టాన్నీ ప్రజాస్వామిక విలువలనూ ఏదో ఒక మేరకు వ్యక్తం చేయాలి. ప్రజాస్వామ్యానికి ఇది ముఖ్యం గానీ ప్రభుత్వం స్థిరంగా ఉండాలనేది ముఖ్యంకాదు.

ఒక్కొక్కసారి ప్రభుత్వాలు అస్థిరంగా ఉండడమే ప్రజాస్వామికం కావచ్చును కూడా. మన దేశంలో ప్రస్తుతం అదే పరిస్థితి ఉందని నా అనుమానం.

దేశ సార్వభౌమత్వాన్ని ఖాతరు చేయకుండా ఒక ఆర్థిక సిద్ధాంతాన్నీ దానికి అనుగుణ్యమైన ఆర్థిక వ్యవస్థాగత నియమాలనూ ప్రపంచ ఆధిపత్య శక్తులు సకల దేశాల మీద రుద్దుతున్న విచిత్రమైన పరిస్థితి ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉంది. ఈ స్థితిలో మూడవ ప్రపంచదేశాల ప్రభుత్వాలు అస్థిరంగా ఉండడం కూడా మంచిదేనేమో. ఈ బలవంతపు విధానాలను అమలు పరచడానికి కావలసిన స్థిరత్వం లోపించడం దేశాల సార్వభౌమత్వాన్ని కాపాడడానికొక దొడ్డిదారి సాధనంగా ఉపయోగపడుతుందేమో!

కాంగ్రెస్ కూటమి, బిజెపి కూటమి అనే రెండు ప్రధాన కూటములు భారత రాజకీయాలలో ఉన్నాయి. 'స్థిరమైన' ప్రభుత్వం ఏర్పాటంటూ అయితే అది వీరో వారో చేయాలి. కానీ ఈ రెండు కూటములకూ అమెరికా నమూనా ప్రపంచీకరణ, సరళీకరణ విషయంలో పూర్తి ఏకాభిప్రాయం. ఉంది. దానిని మొదలు పెట్టింది కాంగ్రెస్ వారు కాగా, అప్పట్లో 'మా విధానాన్ని కాంగ్రెస్ కాపీ కొట్టింది' అని బిజెపి విమర్శించింది.

అటువంటప్పుడు వీరయినా వారయినా స్థిరమైన ప్రభుత్వం ఏర్పాటు చేస్తే జరగబోయేది ఏమిటో ఒకసారి చూసుకోవడం అవసరం. బియ్యం, గోధుమల వంటి ప్రధాన ఆహారపదార్థాలపైనా ఇప్పటికే తగ్గించివేసిన సబ్సిడీని ఇంకా బాగా తగ్గించి వేస్తారు, బహుశా పూర్తిగా తొలగించి వేస్తారు. కరెంటు, సాగునీరు, రవాణా మొదలయిన ప్రజావసరాల ధరలు వాటి ఉత్పత్తికయ్యే ఖర్చుతో సమానం చేస్తారు. అంటే ప్రస్తుతం విభిన్న సామాజికవర్గాలకు ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు తొలగిస్తారు. విద్యారంగం ఖర్చు విద్యార్థులనుండి, వైద్య రంగం ఖర్చు రోగులనుండి ముక్కుపిండి రాబట్టుకోవాలనే ప్రపంచ బ్యాంకు నియమాన్ని మరింత వేగంగా అమలుచేస్తారు. చేతి వృత్తులకూ లఘుపరిశ్రమలకూ ఇప్పటిదాకా ఉన్న రిజర్వేషన్లలో రాయితీలనూ సంపూర్ణంగా తొలగించి పెద్ద కంపెనీలతో పోటీపడమనీ అదే ఆరోగ్యానికి మంచిదనీ చెబుతారు. మన వ్యవసాయరంగాన్ని అంతర్జాతీయ మార్కెట్‌తో పూర్తిగా ముడిపెట్టి తిండిగంజలు, కాయగూరలు, పండ్ల ఎగుమతిని పెంచి, దేశంలోపల వాటిధరలు బాగా పెంచుతారు.

ఏ ఒక్క పార్టీకీ లేక కూటమికీ పార్లమెంటు నిండా సీట్లు లేవు కాబట్టి సరిపోయింది గానీ లేకపోతే ఈ మార్పులన్నీ ఇప్పటికే వచ్చేసి ఉండేవి. దీనికంటే అస్థిరత మేలుకదా?

ఇంకొక కోణం నుండి చూద్దాం స్థిరత్వమే ఒక గొప్ప విలువ అయినట్టయితే బిజెపి కూటమి ఏర్పాటు చేయగల స్థిర ప్రభుత్వం కూడా కాంక్షనీయం కావాలి. కానీ తమకు పూర్తి మెజారిటీ లేకపోవడం వల్ల తాము హిందుత్వ అజెండాను పక్కన బెట్టి ఒక 'జాతీయ' అజెండాను చేపట్టామనీ తమకే మెజారిటీ వస్తే దీనిని వదిలిపెట్టి హిందుత్వ అజెండానే చేపడతామనీ బిజెపి నాయకులు బాహాటంగానే అంటున్నారు. ఆ అజెండాలోని ముఖ్యవిషయం మరికొన్ని మసీదులు కూలగొట్టడం, మరికొన్ని చర్చిలను కాలబెట్టడం అని మనకందరికీ తెలుసును. దానికంటే అస్థిరత మేలు కదా!

కాబట్టి ఏరకంగా చూసినా అస్థిరత వర్ధిల్లాలి!

నిజానికి స్థిరత్వం కోరుకుంటున్న వారు ప్రజాస్వామిక దృష్టితో కోరుకుంటున్నారా లేక అందుకు భిన్నమైన దృష్టితో కోరుకుంటూ ప్రజాస్వామ్యానికి అస్థిరత మంచిది కాదన్న వాదనను అడ్డం పెట్టుకుంటున్నారా అనేది కూడా ఆలోచించవలసిన ప్రశ్నే. ఈ రోజు దేశంలో చాలా మంది భారతదేశం కూడా ఒక సింగపూర్ లాగా ఒక తైవాన్‌లాగా లేదే అని బాధపడుతున్నారు. వేగంగా అట్లా తయారు కావాలని ఉవ్విళ్ళూరుతున్నారు. దానికి కావలసిన 'కఠినమైన' నిర్ణయాలు తీసుకోగల స్థిరమైన ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారు. ఈ 'కఠినమైన' నిర్ణయాలు ప్రధానంగా పేదలకూ బలహీనవర్గాలకు కఠినమైనవి. ఉదాహరణకు కార్మికులకు మరీ ఎక్కువ హక్కులుండడం మన దేశం సింగపూర్ లాగా తైవాన్‌లాగా కాకుండా అడ్డం పడుతున్న అవరోధాలలో ఒకటని చాలామంది అభిప్రాయం. దీనిని తొలగించడానికి 'కఠినమైన' నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది. నిజానికి పారిశ్రామిక వివాదాల చట్టాన్ని సవరించి నీరుగార్చే బిల్లొకటి ఒక దశాబ్దం కాలంగా పార్లమెంటులో పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వాలు అస్థిరంగా ఉండడంవల్ల అది ఇంకా చట్టం కాలేదు.

ఒక్క కార్మికుల హక్కులేకాదు. రేషన్ బియ్యం ధర, కరెంటు సబ్సిడీ, వ్యవసాయానికి చవకరుణాలు, దళితులతోనూ ఆదివాసీలతోనూ మొదలయి వెనుకబడిన కులాలకూ ఇప్పుడు స్త్రీలకూ వచ్చిన రిజర్వేషన్లు, వికలాంగులు, వెనుకబడిన ప్రాంతాలు, చేతివృత్తులు అంటూ భిన్నవర్గాలకూ, ప్రాంతాలకు, వృత్తులకూ ఇచ్చే రాయితీలు, వీటన్నిటి గురించీ 'కఠినమైన' నిర్ణయాలు తీసుకోవాలనీ దానికి కావలసిన స్థిరమైన ప్రభుత్వం అవసరమనీ బాధపడేవాళ్ళు చాలామంది ఉన్నారు. అదే తమ బాధ అనీ అందుకోసమే రాజకీయాలలో అస్థిరతను వ్యతిరేకిస్తున్నామనీ చెప్పుకుంటే సరిపోతుంది. తమకేదో ప్రజాస్వామ్యం మీద ప్రేమ ఉన్నట్టు అస్థిరత ప్రజాస్వామ్యానికి చేటంటూ వాదించనవసరంలేదు.

యాభై సంవత్సరాల స్వతంత్ర భారత చరిత్రలో మనం గర్వించ[illegible]ది ఏమైనా ఉంటే అది మనం నిలబెట్టుకున్న ఈ మాత్రం ప్రజాస్వామ్యమే. దాని అపరిపక్వతనూ అసమర్ధతనూ పోగొట్టడానికి సూచించే ఏ సంస్కరణ అయినా ఆహ్వానించదగ్గదే గానీ ఉన్న ఈ పాటి ప్రజాస్వామ్యాన్ని సహితం పోగొట్టే సంస్కరణలు కావు. సంస్కృతిలోనే కాక అవసరాలలో ప్రయోజనాలలో పరిస్థితులలో ఇంత వైవిధ్యం ఉన్న ఈ దేశానికి అధ్యక్ష తరహా పాలనకన్నా ఇప్పుడున్న పార్లమెంటరీ వ్యవస్థే మెరుగయినది. నిజానికి దీనిలోనే మరింత లోతయిన వికేంద్రీకరణ ప్రవేశపెట్టి మన దేశ పరిస్థితులకు దీనిని మరింత అనుగుణంగా రూపొందించడం అవసరం. పదిలక్షల మందికి ఒక్కరు ప్రతినిధిగా ఉండే పార్లమెంటు చేతిలో శాసనాధికారాన్ని, ఆ పార్లమెంటులో మెజారిటీ ఉన్న పార్టీ చేతిలో ప్రధాన విధాన నిర్ణయాధికారాన్ని పెట్టడం ప్రజాస్వామ్యాన్ని చాలా బలహీనపరిచే ఏర్పాటు. గ్రామపంచాయితీ నుండి పార్లమెంటు వరకు ఏ స్థాయిలో తీసుకోగల నిర్ణయాన్ని ఆ స్థాయిలోని ప్రాతినిధ్య సంసలకే వదిలేసే వికేంద్రీకరణ అవసరం.

అటువంటి రాజకీయ వ్యవస్థ ఏమంత 'స్థిరత్వాన్ని' ఇవ్వకపోవచ్చు. అది ప్రపంచ బ్యాంకు కోరుకునే 'కఠినమైన' నిర్ణయాలు తీసుకోలేకపోవచ్చు. కానీ భారతదేశ పరిస్థితులలో ప్రజాస్వామ్యానికి అదే మంచిది.

మనం కోరుకునేది ప్రజాస్వామ్యం కాకపోతే, అతివేగవంతమైన ఆర్థిక అభివృద్ధికొక నమూనాను దృష్టిలోపెట్టుకొని దానికి కావలసిన రాజకీయ వ్యవస్థను సాధించడమే మన లక్ష్యమయినట్టయితే, ఆ సంగతి బాహాటంగా చెప్పుకుంటే మంచిది.

ఇదంతా అటుంచి, ఇప్పుడున్న రాజకీయ దుస్థితికి రాజ్యాంగం నిర్దేశించిన రాజకీయ వ్యవస్థకంటే రాజకీయ పార్టీలదీ రాజకీయ నాయకులదే ఎక్కువ బాధ్యత అంటే ఎవ్వరూ తప్పు పట్టరనుకుంటాను. ఈ నాయకులను తిట్టడానికి ఈ రోజు తిట్లు కూడా మిగలలేదు. మన భవితవ్యం కనీసం మన చేతులలో ఉంటుందా లేదా అనే కీలకమైన విషయం గురించి తీవ్రమైన ఘర్షణ జరగవలసి ఉన్న దశలో ఆ కర్తవ్యాన్ని నూరవవంతు కూడా అందుకోజాలని వ్యక్తులు దేశరాజకీయాలను నడుపుతున్నారు. ఎక్కడెక్కడో మొదలయిన రాజకీయ ప్రవంతులు ఈ రోజు మురికి కాలువలై ప్రహిస్తున్నాయి. దీనికి ఏ ప్రవంతీ మినహాయింపు కాదు. జయలలితలో పెరియార్‌ను చూడడం ఎంత కష్టమో, కాన్షీరాంలో అంబేద్కర్‌ను చూడడం అంతే కష్టం. సోనియాగాంధీలో మహాత్మాగాంధీని చూడడం ఎంతకష్టమో హరికిషన్ సింగ్ సూర్జీత్‌లో మార్క్స్‌ను చూడడం కూడా అంతే కష్టం.

ఈ రాజకీయ భ్రష్టత్వం కన్నా బాధాకరమైనది. దానిని మనమందరమూ సహిస్తున్న వైనం. తన అపారమైన అక్రమార్జనను కాపాడుకోవడం తప్ప వేరే రాజకీయ లక్ష్యంగానీ గమ్యంగానీ లేని జయలలిత దేశ రాజకీయాలను తన వేలిచుట్టూ తిప్పుకొని ఆట ఆడించిన తీరుకంటే జుగుప్సాకరం ఆమె ఆటలకు రాజకీయం అనే ఆమోదముద్రవేసిన మన మౌనం.

ఇక్కడ ప్రధానంగా తప్పు పట్టవలసింది పత్రికలను, ఇతర ప్రసార సాధనాలను. నీతిమాలిన చర్యలను రాజకీయంగా చలామణి చేసుకోవడం అసాధ్యమనే భయం రాజకీయ నాయకులలో కలిగించగల స్థితిలో ఉన్నవి. ఈ ప్రసార సాధనాలు మాత్రమే. ఆ కర్తవ్యంలో ప్రసారసాధనాలు తాము విఫలం కావడమే కాదు, ఆ క్రమంలో ప్రజలకు కూడా 'ఇదీ రాజకీయమే'ననే అభిప్రాయం కలిగించి మరింత నష్టం చేశాయి.

ఈ నేపథ్యంలో ఇప్పుడు మళ్ళీ ఎన్నికలొస్తున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియపట్ల గౌరవం కొద్దీ ప్రజలు దీనిలో పాల్గొనాలే తప్ప ఈ ఎన్నికలకు బాధ్యులయినవారి పట్లగానీ బాధితులయిన సంఘపరివార్ పట్ల గానీ గౌరవంతో కాదు. పదమూడు నెలలు పరిపాలించిన బిజెపి ప్రభుత్వానికి తాను ఎందుకు పరిపాలించిందో తెలీదు. దానిని కూల్చిన వారికి తాము ఎందుకు కూల్చారో తెలియదు. నలభై సూటుకేసులేసుకొని ఢిల్లీకి పోయి రోజుకు నలభైవేల కిరాయి వసూలు చేసే హోటల్లో బసచేసి ఒక ప్రభుత్వాన్ని కూల్చి ఇంకొక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేక ఏటి ఒడ్డున ఇసుకలో ఇల్లుకట్టి కొంతసేపు ఆడుకొని ఇంక విసుగొచ్చిన తరువాత కాలితో తన్ని కూల్చేసి ఇంటికి తిరిగిపోయే ఆకతాయిలాగా సూట్‌కేసులన్నీ తీసుకొని చెన్నైకి తిరిగొచ్చిన జయలలిత మన రాజకీయ దుస్థితికి ఒకసంకేతమైతే, తిరిగి జయలలితకూ ఆమె బోటివారికే ఈ ఎన్నికలు పట్టం గడతాయేమోనన్న భయం అంతకంటే లోతయిన దుస్థితికి సంకేతం.

భారతప్రజాస్వామ్యం అపరిపక్వతను వాడుకొని ప్రజల జీవితాలతోనూ దేశ భవిష్యత్తుతోనూ ఈ నాయకులు ఆటలాడుకుంటున్నారు. దానికి విరుగుడు ప్రజాస్వామ్యాన్ని ఇప్పుడున్న దానికన్నా బలహీనపరచి ప్రజలకు మరింత దూరం చేసే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలలో లేదు. ఒకే వ్యక్తి నేరుగా ఎన్నికయి ఎవరికీ జవాబుదారు కాకుంటే అయిదేళ్ళు పరిపాలించే అధ్యక్షతతరహా పరిపాలన, భిన్న ప్రణాళికలైన వోట్లడిగి ఎన్నికయిన పార్టీలన్నీ అధికారాన్ని పంచుకొని ఒక ప్రతిపక్షమంటూ లేకుండా పోయే జాతీయ ప్రభుత్వమూ ఈ పనే చేస్తాయి.

ఇప్పుడు కావలిసింది మన ప్రజాస్వామ్య వ్యవస్థలోని అసమగ్రతనూ అపరిపక్వతనూ పోగొట్టే కృషి. దానికి లోతయిన వికేంద్రీకరణ వంటి వ్యవస్థాగత సంస్కరణలు ఎంత అవసరమో, సామాజిక చైతన్యంలో దానికి తగిన విలువలనూ ఆలోచనలనూ పెంపొందించడానికి కృషి చేయడం కూడా అంతే అవసరం. ఇక్కడ 'మేధావి వర్గం' అని పిలవబడే బుద్ధి జీవుల వైఫల్యం, ప్రసార సాధనాల వైఫల్యం చాలా ఉంది. ప్రజాస్వామ్యాన్ని వీరు వాడుకున్నంతగా ఎవరూవాడుకోలేదు. అది వీరికి అందుబాట్లో ఉన్నంతగా వేరే ఎవరికీ లేదు. కానీ దానిని బలోపేతం చేయడానికి వీరు చేస్తున్న కృషి స్వల్పం. దానిబదులు ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రతిపాదనలను వెనకేసుకొచ్చేవారు కొందరయితే, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్న రాజకీయ పార్టీలకూ నాయకులకూ అందమయిన రంగులు పూసి దాని విధ్వంసానికి తోడ్పడేవారు కొందరు. ప్రజాస్వామ్యాన్ని వాడుకోవడమే తప్ప దానికి బలం చేకూర్చే కర్తవ్యం తమదికాదని ఈ దేశంలో అందరూ అనుకుంటున్నారు. ఈ విషయంలో అందరికంటే ఎక్కువ బాధ్యత బుద్ధి జీవులు, పత్రికలు, ప్రసార సాధనాలపైనే పెట్టకతప్పదు. ఇప్పటికైనా వీరు తమ బాధ్యతను గుర్తించుకోకపోతే జయలలితలూ, ములాయంసింగ్‌లూ, హరికిషన్ సింగ్ సూర్జిత్‌లూ ప్రజాస్వామ్యంతో ఆటలాడుకుంటూనే ఉంటారు. దానిని ఆసరా చేసుకొని 'అస్థిరత' గురించి చర్చ పెట్టి ప్రజాస్వామ్యాన్నే నీరుగార్చే ప్రమాదకరమైన ప్రయత్నాలు సాగుతూనే ఉంటాయి.

భారతప్రజాస్వామ్యం అపరిపక్వతను వాడుకొని ప్రజల జీవితాలతోనూ దేశ భవిష్యత్తుతోనూ ఈ నాయకులు ఆటలాడుకుంటున్నారు. దానికి విరుగుడు ప్రజాస్వామ్యాన్ని ఇప్పుడున్న దానికన్నా బలహీనపరచి ప్రజలకు మరింత దూరం చేసే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలలో లేదు. ఒకే వ్యక్తి నేరుగా ఎన్నికయి ఎవరికీ జవాబుదారు కాకుంటే అయిదేళ్ళు పరిపాలించే అధ్యక్షతతరహా పరిపాలన, భిన్న ప్రణాళికలైన వోట్లడిగి ఎన్నికయిన పార్టీలన్నీ అధికారాన్ని పంచుకొని ఒక ప్రతిపక్షమంటూ లేకుండా పోయే జాతీయ ప్రభుత్వమూ ఈ పనే చేస్తాయి.